క్లుప్తంగా

ఉదయం పూటనే వేలం

నెక్కొండ : వేసవి తీవ్రత దృష్ట్యా మొక్క జొన్నల వేలం పాటలు ఉదయం వేళల్లో నిర్వహించనున్నట్లు నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు గురువారం ప్రకటనలో తెలిపారు. రైతులు ఉదయం 9గంటల లోపు మొక్కజొన్నలు మార్కెట్ తీసుకు రావాలని ఆయన సూచించారు. వ్యాపారులు కొనుగోలు చేసిన మక్కలు మార్కెట్ యార్డ్‌లో పేరుకుపోయాయన్నారు. వ్యాపారుల విజ్ఞప్తి మేరకు 13(శనివారం) మక్కల కొనుగోళ్లు చేపట్టబోరని ఆయన పేర్కొన్నారు. యథావిధిగా 15(సోమవారం) నుంచి కొనుగోళ్లు జరుగుతాయన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి మార్కెట్‌కు సహకరించాలని కోరారు.

నేడు మంత్రుల పర్యటన

దుగ్గొండి : మండలంలోని పలు గ్రామాలలో అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు నేడు(శుక్రవారం) రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పర్యటించనున్నట్లు మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గిర్నిబావి నుంచి దుగ్గొండి వరకు రూ.15 కోట్లతో నిర్మించనున్న డబుల్‌రోడ్డు నిర్మాణ పనులను, చలపర్తిలో 10 వేల మెట్రిక్‌టన్నుల సామర్థ్యం గల గోదాంను ప్రారంభిస్తారన్నారు. అనంతరం 2023మార్చి నెలలో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు.

మసీదు ప్రహరీకి శంకుస్థాపన

సంగెం : మండలంలోని పల్లారుగూడ జమ్ జమ్ మసీద్ ఈద్గా, కబ్రస్తాన్ ప్రహరీ నిర్మాణానికి ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఈద్గా ప్రహరీ కోసం రూ 9లక్షల 90వేలు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కుమారస్వామి, బిచ్చా నాయక్, ఎంపీటీసీ వీరమ్మ, ఉప సర్పంచ్ రఘు, కోఆప్షన్ సభ్యుడు మన్సూర్ అలీ, నాయకులు మహిమొద్దిన్, జియ, అక్రం ,యాకూబ్, సాహోబ్ అలీ, గుంషావతి, కాజమనోద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు


విద్యార్థికి ధైర్యం చెబుతున్న ఎమ్మెల్యే పెద్ది

చెన్నారావుపేట : మండలంలోని సూర్యపేట తండాకు చెందిన విద్యార్థి ధరావత్ అశ్విత గురువారం ఎంసెట్ పరీక్ష రాయడానికి తన సోదరుడితో కలిసి ద్విచక్ర వాహనంపై హనుమకొండకు వెళ్తుంది. ఈ క్రమంలో జల్లీ క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురికావడంతో గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి రోడ్డు ప్రమాదాన్ని గమనించాడు. వెంటనే విద్యార్థి పరిస్థితిని పరిశీలించి చికిత్స కోసం నర్సంపేట జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యులతో మాట్లాడారు. తక్షణ వైద్యం అందించాలని వైద్యులకు సూచించాడు. చికిత్స అనంతరం పరీక్ష మంచిగా రాయాలని ధైర్యం చెప్పి పంపించారు.

స్మృతివనంలో చోరీ

ఐనవోలు : మండలంలోని పంథిని రెవెన్యూ పరిధి కక్కిరాలపల్లి క్రాస్ వద్ద ఉన్న స్మృతివనంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై గుగులోత్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి స్మృతివనంలోకి ప్రవేశించి వాచ్‌మన్‌గా పని చేస్తున్న బాష బోయిన యాకయ్యను కొట్టి భయభ్రాంతులకు గురిచేశారు. అక్కడే ఉన్న ఎల్‌ఈడీ టీవీ, రెండు స్పీకర్లు, ఆంప్లీఫైర్ బాక్స్‌ను దొంగిలించారు. కాగా సంఘటన స్థలానికి సీఐ శ్రీనివాస్, ఎస్సై వెంకన్న చేరుకుని విచారణ చేపట్టారు. చోరీ వస్తువుల విలువ సుమారు రూ.1,50,000 వరకు ఉంటుందని స్మృతివనం యజమాని నాయిని అనిల్ తెలిపారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి శివారు కాశగూడెనికి చెందిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఎస్సై గుగులోత్ వెంకన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం చెన్నారం గ్రామానికి చెందిన ఎస్‌కే యాకూబ్ ఐనవోలు మండలంలోని కక్కిరాలపల్లి శివారు కాశగూడెంలో బండరాయి కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 6న తనకున్న గేదెను మేపుతుండగా అది పరుగెత్తింది. దాని వెంట అతను కూడా పరిగెత్తగా అదుపు తప్పి కిందపడిపోగా రాయి తగిలి తలకు బలమైన గాయాలయ్యాయి. కాగా ఎంజీఎంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

గోదావరి జలాలతో అధిక దిగుబడి

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి


ఖానాపురం: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెద్ది తదితరులు

ఖానాపురం : పాకాల చెంతకు గోదావరి జలాలు చేరడంతో ఆయకట్టు పరిధిలో దిగుబడులు పెరిగాయని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మనుబోతులగడ్డలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో రూ.29లక్షల నిధులతో గోదాం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే మనుబోతులగడ్డ, బుధరావుపేటతో పాటు పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వడగళ్ల వర్షానికి 41వేల 500మంది రైతులు నష్టపోయినట్లు గుర్తించామని తెలిపారు. వీరికి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నేడు(శుక్రవారం) దుగ్గొండి మండలం చలపర్తి గ్రామంలో వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు చేతుల మీదుగా పరిహారం చెక్కులను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మూడు లక్షల మెట్రిక్ టన్నుల గోదాంలు ఉండగా ఇందులో నర్సంపేటలోనే లక్ష మెట్రిక్ టన్నుల గోదాంల నిర్మాణం పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని గోదాంలలో ఉచితంగా నిల్వ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకటనర్సయ్య, వైస్ ఎంపీపీ ఉమారాణి, సర్పంచ్ సోమయ్య, కో ఆప్షన్ మెంబర్ మస్తాన్, ఆర్‌బీఎస్ కన్వీనర్ వెంకట్‌రెడ్డి, డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

సంగెం : మండలంలోని పల్లారుగూడలో కాశోజీ మ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళారులను నమ్మి మోస పోవద్దని, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.కార్యక్రమంలో సర్పంచ్‌లు కక్కెర్ల కుమారస్వామి, బిచ్చా నాయక్, ఎంపీటీసీ గుగులోత్ వీరమ్మ, ఉప సర్పంచ్ రఘు, నాయకులు మహిమొద్దిన్, మన్సూర్ అలీ, గోపిసింగ్, సదానందం, ఎల్లస్వామి, మోహన్, జలంధర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


సంగెం: పల్లారుగూడలో..

దామెరలో..

దామెర : రైతుల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమని పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు స్పష్టం చేశారు. మండలంలోని ఊరుగొండ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న, వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరుగాలం శ్రమించి పండించిన రైతులకు సరైన ధర లభించాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకుని పంట ఉత్పత్తులకు మద్దతు ధర పొందాలని సూచించారు.

ఆయిల్ పామ్ మొక్కలను కాపాడుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న డివిజన్ ఉద్యానవన అధికారి జ్యోతి

దుగ్గొండి : వేసవి తీవ్రత దృష్ట్యా ఎండల నుంచి ఆయిల్‌పామ్ మొక్కలను కాపాడుకోవడానికి అంతరపంటగా నువ్వులు, జనుము సాగు చేయాలని నర్సంపేట ఉద్యానవన అధికారి జ్యోతి తెలిపారు. ఈ మేరకు మండలంలోని లక్ష్మీపురం రైతు వేదికలో ఆయిల్ పామ్ రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కలను మొదటి ఏడాది జాగ్రత్తగా కాపాడుకుంటే మరుసటి ఏడాది నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఆయిల్‌పామ్‌లో అంతరపంటగా మొక్కజొన్న సాగు చేసిన రైతులకు వ్యర్థాలను తగులబెట్టడం చేయవద్దన్నారు. భూమిలోనే కలియదున్నితే మొక్కకు పురుగు వచ్చే అవకాశం ఉందన్నారు. కాబట్టి మొక్కజొన్న కాడలను తీసి బయట పడవేయాలన్నారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ మొక్కలను అడవిపందులు నాశనం చేశాయని వాటి స్థానంలో వేరే మొక్కలను ఇవ్వాలని అందుకు తాము ఖరీదు చెల్లిస్తామని కోరారు. ఈకార్యక్రమంలో రామ్‌చరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ జీఎం సతీష్, స్థానిక సర్పంచ్ పాండవుల సురేందర్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

తాపీమేస్త్రీ సంఘం కార్యవర్గం


టి.రమేష్, అధ్యక్షుడు

చెన్నారావుపేట : చెన్నారావుపేట తాపీమేస్త్రీ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా తెప్ప రమేష్, ఉపాధ్యక్షుడిగా ఎదురబోయిన వీరస్వామి, ప్రధాన కార్యదర్శిగా మండి శ్రీను, సహాయ కార్యదర్శిగా జెట్టబోయిన మహేందర్‌ను ఎన్నుకున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు బండి ఉపేందర్, కోశాధికారి ఎదురబోయిన వీరేంద్రనాథ్ తెలిపారు.

విశ్వకర్మ సెల్ కోకన్వీనర్‌గా..

వరంగల్ (పర్వతగిరి) : బీజేపీ విశ్వబ్రాహ్మణ సెల్ కో కన్వీనర్‌గా మండలంలోని చింతనెక్కొండ గ్రామానికి చెందిన తాడోజు శ్రావణ్‌చారిని నియమించినట్లు బీజేపీ రాష్ట్ర విశ్వకర్మ సెల్ కన్వీనర్ పూసల బ్రహ్మచారి, కో కన్వీనర్ చొల్లేటి కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా శ్రావణ్‌చారి మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ కొత్త పథకం ద్వారా విశ్వబ్రాహ్మణులను ఆదుకోవడానికి మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

కుక్కలు, కోతుల బారి నుంచి కాపాడాలి


గాయాలను చూపుతున్న బాధితులు

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి బొంతల జశ్వంత్ గురువారం వీధిలో ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. అక్కడే ఉన్న స్థానికులు అరిచి కుక్కలను తరిమి కొట్టడంతో బాలుడు జశ్వంత్ ప్రాణాలతో బయటపడ్డాడు. అదే గ్రామానికి చెందిన తాళ్లపెల్లి రమేష్ ఇంటి నుంచి రోడ్డుపైకి వస్తున్న క్రమంలో కోతులు దాడి చేయగా గాయపడ్డాడు. అలాగే మండలంలోని నల్లబెల్లి గ్రామానికి చెందిన బిర్రు రాధికపై కుక్కలు దాడి చేయడంతో గాయాలు కాగా వర్ధన్నపేట ఆస్పత్రికి తరలించారు. అనంతరం చికిత్స నిర్వహించి టీకా వేసి పంపించారు. కోతులు, కుక్కలతో గ్రామాల్లో, పట్టణాల్లో అయినా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకవర్గాలు కుక్కలు, కోతులను అరికట్టి వాటి బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

భూమి పూజ



నర్సంపేట : పట్టణంలోని 8వ వార్డు నెహ్రూనగర్ కాలనీ సమీపంలో పురుషుల పొదుపు సంఘం నూతన భవన నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ముత్యాల వీరస్వామి, ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, సభ్యులు సంతోష్, కృష్ణమూర్తి, సూరయ్య, రాజు, రంజిత్, శివ, సాంబయ్య, శోభన్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ స్వాముల ప్రత్యేక పూజలు


భిక్ష చేస్తున్న హనుమాన్ స్వాములు

నెక్కొండ : నియమ నిష్ఠలతో దీక్ష చేపట్టిన హనుమాన్ స్వాములు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం నెక్కొండ వట్టి వాగు సమీపంలోని పంచముఖాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు, కీర్తనలతో మారుమోగాయి. అనంతరం మండల కేంద్రానికి చెందిన రూపురెడ్డి సుధాకర్‌రెడ్డి-సుజాత దంపతులు స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎర్రబెల్లి సంపత్‌రావు, సుమారు 150 మంది హనుమాన్ స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్సు అందజేత

హన్మకొండ : బస్సులో పోగొట్టుకున్న పర్సును ఆర్టీసీ అధికారులు ప్రయాణికురాలికి అందించారు. తిమ్మంపేట గ్రామానికి చెందిన సంగతి రజిత నర్సంపేట డిపోకు చెందిన బస్సులో నర్సంపేట నుంచి వరంగల్‌కు ప్రయాణిస్తూ పర్సు పోగొట్టుకుంది. ప్రయాణికురాలు నర్సంపేట కంట్రోలర్ ఈశ్వర్‌ను కలిసి పరిస్థితిని వివరించగా విధుల్లో ఉన్న కండక్టర్‌తో మాట్లాడి పర్సు స్వాధీనం చేసుకుని గురువారం ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ పి.శ్రీనివాస్ చేతుల మీదుగా తిరిగి రజిత కుటుంబ సభ్యునికి అందించారు. నిజాయితీగా పర్సు అందించిన కండక్టర్ బి.వీరన్న, డ్రైవర్ ఎస్.చందుకు రజిత కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

రాయపర్తి : మండలంలోని పెర్కవేడు గ్రామానికి చెందిన తాటికాయల భాస్కర్ ఇటీవల మృతిచెందాడు. కాగా గురువారం స్థానిక అంబేడ్కర్ సంఘం నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం రూ.5వేల ఆర్థికసాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు గారె కిరణ్, శుభాకర్, భాస్కర్, బందు రాజు, వెంకన్న, ఐత కరుణాకర్, తాటికాయల సైదులు, అనిల్, కిషన్, నవీన్, రాజు, చంద్రశేఖర్, వెంకటేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో..

వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణంలోని 7వ డివిజన్‌కు చెందిన ఆలకుంట లావణ్య చేతికి గాయమై బాధపడుతోంది. ఆమె వైద్యం చేయించుకునేందుకు మాజీ జెడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి గురువారం వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు.


రాయపర్తి: సాయం అందజేస్తున్న నాయకులు


పరామర్శ

చెన్నారావుపేట : మండలంలోని జల్లీ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఇరుపుల మార్కండేయ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మార్కండేయను గురువారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట నర్సంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాలయి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మొగిళి వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య, నాయకులు, సర్పంచ్‌లు, ఉన్నారు.

రక్తదాన శిబిరం

హన్మకొండ కల్చరల్ : హనుమకొండలోని ఏషియన్‌మాల్ సమీపంలో గల సాయిబాబా మందిరంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మందిరం ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎంజీఎం ఆస్పత్రిలో తీవ్ర రక్త కొరత దృష్ట్యా ఎంజీఎం బ్లడ్‌బ్యాంక్ అధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి భక్తుల నుంచి 38 యూనిట్ల రక్త సేకరించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తలు రాకం సదానందం, డా. పూస సురేష్‌కుమార్, డాక్టర్ ఆశ, బ్లడ్ మోటివేటర్ కళ్యాణి, సాగంటి మంజుల, రాజ్ కుమార్, దేవునూరి ఆనంద్ సిబ్బంది పాల్గొన్నారు.

‘మిషన్ వాత్సల్య’పై అవగాహన కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ రాజేష్

శాయంపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలౌతున్న ‘మిషన్ వాత్సల్య’ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ టీచర్లకు నేరేడుపల్లి సర్పంచ్ ఆకుతోట రాజేష్ సూచించారు. మండలంలోని ఆ గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ (వీసీపీసీ) సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాల్లోని తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను గుర్తించి మిషన్ వాత్సల్య పథకం కింద ఎంపిక చేసి తీర్మాణం ద్వారా జిల్లా స్థాయి కమిటీకి పంపించాలని చెప్పారు. పథకం కింద ఎంపికైన బాలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నెలకు రూ.4 వేలు చొప్పున ఆర్థికసాయం అందజేస్తాయనని తెలిపారు. పథకాన్ని అర్హులు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు చొరవ తీసుకుని అర్హులకు పథకం వర్తింపజేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చేయూత

ఆత్మకూరు : మండలంలోని పెద్దాపురం గ్రామానికి చెందిన పేదరాలి వివాహానికి కామారం గ్రామానికి చెందిన ‘మన కామారం’ వాట్సప్ గ్రూప్ చేయూత అందించింది. పెద్దాపురం గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన నర్మెటి రజిత తన కూతురు ప్రియాంక వివాహాన్ని గురువారం జరిగింది. రజిత పేదరికంతో ఇబ్బంది పడుతుండడాన్ని గ్రూప్ అడ్మిన్, సభ్యులు గమనించి వివాహ నిర్వహణ కోసం రూ.36 వేలు సాయం అందించారు.

తడిసిన మక్కలను కొనుగోలు చేయాలి

- గీసుకొండ మండల సభలో తీర్మానం
- అక్రమ వెంచర్లపై చర్య తీసుకోవాలి
- ప్రొటోకాల్ నిబంధనలు పాటించాలి



మండల సభలో మాట్లాడుతున్న ఎంపీపీ సౌజన్య

గీసుకొండ : అకాల వర్షాలు, వడగళ్లతో తడిసిన మొక్కజొన్నలను కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20 వేల పరిహారం అందించాలని గీసుకొండ మండల సభ తీర్మానించింది. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బీమగాని సౌజన్య అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశాన్ని ఏర్పాటు చేయగా పలు తీర్మానాలు చేశారు. మండలంలోని వ్యవసాయ భూములను అక్రమంగా వెంచర్లు చేసి విక్రయిస్తుండటంతో రిజిస్ట్రేషన్ కాక కొనుగోలు దారులు ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ భిక్షపతి, వీరారావు కోరారు. మండలాన్ని ‘కుడా’ పరిధిలో విలీనం చేయడంతో ఇంటి నిర్మాణ అనుమతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, గతంలో మాదిరి గ్రామపంచాయతీలకు అనుమతి ఇచ్చే అధికారం ఇవ్వాలని గంగదేవిపల్లి సర్పంచ్ గోనె మల్లారెడ్డి అధికారుల దృష్టికి తెచ్చారు. అధికారులు ప్రోటోకాల్ నిబంధనలు పాటించడం లేదని, మండలంలో ఎంపీపీని కాదని జెడ్పీటీసీ ప్రారంభోత్సవాలు చేస్తున్నారని, సర్పంచ్‌లను కాదని ఎంపీటీసీలు ప్రారంభోత్సవాలు చేయరు కదా.. అని ఎంపీపీ బీమగాని సౌజన్య ఆవేదన వ్యక్తం చేశారు. నర్సంపేట ఆర్టీసీ డిపో నుంచి ఆరెపల్లికి అదనంగా మూడు ట్రిప్పుల సర్వీసు సౌకర్యం కల్పించాలన్నారు. ఎలుకుర్తిలో రోడ్డు వెడల్పు వల్ల ఇళ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి నిధులు రాలేదని అధికారులకు ఏఈ సుధాకర్ నివేదించాలని సభ్యులు కోరారు. ఎస్సీలకు వంద యూనిట్ల విద్యుత్ దాటితే పూర్తి బిల్లు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని ఎంపీటీసీ భిక్షపతి సభ దృష్టికి తెచ్చారు. పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ వీరేశం, నాయబ్ తహసీల్దార్ రంజిత్, ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, ఏఓ హరిప్రసాద్‌బాబు, ఎంఈఓ చదువుల సత్యనారాయణ, ఎంపీటీసీలు గోపాల్, కోమల, రజిత, కోఆప్షన్ సభ్యులు రహీం, ఏపీఓ చంద్రకాంత్, ఏఈలు సంపత్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్యాణి పాల్గొన్నారు.

‘సఖి’ సేవలపై మహిళలకు అవగాహన


మహిళలకు అవగాహన కల్పిస్తున్న సఖి సిబ్బంది

సంగెం : మహిళలు, బాలికలు తమ సమస్యలను ధైర్యంగా ఎదుర్కొవాలని సఖి లీగల్ కౌన్సిలర్ శోభారాణి అన్నారు. గురువారం మండలంలోని గుంటూరుపల్లి, నల్లకుంట గ్రామాల్లో సఖి కేంద్రం మహిళలు, బాలికల కోసం అందజేస్తున్న సేవలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల రక్షణ చట్టాలు, కౌన్సెలింగ్, వైద్య సాయం, తాత్కాలిక వసతి, పోలీస్, న్యాయ సాయం గురించి వివరించారు. అత్యవసర సమయాల్లో మహిళా హెల్ప్‌లైన్ 181, 0870-2935014, చైల్డ్ లైన్-1098 కాల్ చేసి సాయం పొందవచ్చన్నారు. 18ఏళ్లలోపు బాలికలపై లైంగిక వేధింపులు పాల్పడిన వారిపై పోక్సో కేసు నమోదు చేసి శిక్షిస్తారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిత, సఖి సిబ్బంది సుధ తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా ధాన్యం కొనాలి


గిర్నిబావిలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

- గిర్నిబావిలో కాంగ్రెస్ శ్రేణుల రాస్తారోకో

దుగ్గొండి : రైతులు పండించిన ధాన్యం, మొక్కజొన్నలను ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్‌చేస్తూ మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం గిర్నిబావిలో ప్రధాన రహదారిపై గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై నవీన్‌కుమార్ ఆందోళనకారులకు సర్దిచెప్పి రాస్తారోకో విరమింపజేశారు. అనంతరం నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. అకాల వర్షాల వల్ల మొక్కజొన్న, వరి పంట నేలవాలిందన్నారు. గింజలలో కొంత నాణ్యత సహజంగా దెబ్బతింటుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో నాణ్యత లేదని నిర్వాహకులు కొనుగోలు చేయడం లేదన్నారు. బేషరతుగా ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, చెన్నూరి కిరణ్‌రెడ్డి, పెండ్యాల రాజు, మాదాసి సాంబయ్య, హింగే రామారావు, దంజ్యా నాయక్ , వేముల ఇంద్రదేవ్, ఎడెల్లి శ్రీనివాసరెడ్డి, ఆవుల నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే యువతకు ఉపాధి


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రాయపర్తి : కాంగ్రెస్ పార్టీతోనే యువతకు ఉపాధి అవకాశాలు సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య అధికంగా ఉన్నందున ఏఐసీసీ నాయకురాలు ప్రియాంకగాంధీ హైదరాబాద్‌లో యూత్ సంఘర్షణ సభ నిర్వహించినట్లు చెప్పారు. ఈ సభలో యువతకు భరోసా కల్పిస్తూ హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ చేశారని గుర్తు చేశారు. ఈ యూత్ డిక్లరేషన్‌కు రాయపర్తి మండలంలో యువకులు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తొర్రూరు కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు జాటోత్ హామ్యా నాయక్, సరికొండ కృష్ణారెడ్డి, కమల్‌సింగ్, మహేందర్ రెడ్డి, గారె భిక్షపతి, నర్సింహా, బైరి వెంకటరాజ్యం, మచ్చ రమేష్, రామ్మూర్తి, దేవేందర్, సోడెపు శ్రీనివాస్, కుంట రాజు తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్సై అనిల్‌ను కఠినంగా శిక్షించాలి’


మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

శాయంపేట : ముస్లిం విద్యార్థిపై చేయి చేసుకుని అనుచితంగా ప్రవర్తించిన జగిత్యాల రూరల్ ఎస్సై అనిల్‌ను కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ విద్యార్థి సమాఖ్య (ఏబీఎస్ఎఫ్) జిల్లా కన్వీనర్ నాగుల పవన్ కల్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరస్తులపై చర్యలు తీసుకుని బాధితుల పక్షాన నిలవాల్సిన పోలీసు అధికారి అధికార దురహంకారంతో మైనార్టీకి చెందిన ముస్లిం విద్యార్థిపై దౌర్జన్యానికి తెగబడడం దుర్మార్గమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, పోలీసు శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి ఎస్సై అనిల్‌ను విధుల నుంచి పర్మనెంట్‌గా తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు కొంగర విజయ్, ఉపాధ్యక్షుడు నరేష్, నాయకులు తరుణ్, కన్నా, శివ, నాగులు, చింటు పాల్గొన్నారు.